## కథ

# ప్రసాదుకి పెళ్లి కుదిరింది

ప్రసాదు మనసు ఉల్లాసంగా ఉంది. పది సంవత్సరాల తర్వాత తను పుట్టిన దేశంలో ఇన్ని నెలలు గడిపే అదృష్టం, అమ్మ చేతి గోరుముద్దలు తింటూ నాన్న ఆప్యాయతను, ఆయన చెప్పే కమ్మకమ్మని కబుర్లను వెంటవెంటే తిరుగుతూ చవిచూస్తుంటే మళ్లీ పసితనం తిరిగొచ్చినంత సంబరం.

చిన్ననాటి మిత్రులు ఒక్కొక్కరినీ కలవడం, అమ్మా-మావయ్య, పిన్నమ్మలతో రోజుకో దేవాలయానికి వెళ్లిరావడం కొండంత తృప్తిగా ఉంది. వాళ్లంతా కురిపించే వాత్సల్యం తనని ఆనంద లోకాలలో తేల్చేస్తోంది. తనొక్కడిలోనేనా ఈ సంబరం తన వాళ్లందరిలోనూ చూడగలుగుతున్నాడు. ఇన్నిజతల కళ్లు కన్నకలలు పండించగలిగాడు తను. ఆ మాటే బంధువులందరి నోట వింటున్న తన జీవితం ధన్యం కదా!

అతి సామాన్యమైన రైతుకుటుంబంలో పుట్టిన బిడ్డ తను. తన పుట్టుకే అమ్మవైపు నాన్నవైపు వాళ్లు కూడా ఒక వరంలా భావించారు. తనకి వరప్రసాద్ అని పేరు పెట్టుకొని అల్లారుముద్దుగా పెంచారు. నాన్న ఏమంత ఆస్తిపరుడని? పదెకరాల మాగాణి ఉన్నా ఓ ఏడు పండితే రెండేళ్లు ఫలితం శూన్యం. నాన్న ఎంతో చాకచక్యంతో మార్చి మార్చి ఎప్పుడు ఏ పంట పండిస్తే ఆదాయం పెరుగుతుందో సంసారం ఒడిదుడుకులు లేకుండా సాగిపోతుందో ఆలోచించి వ్యవహరించే వారు. తనకి ముగ్గురక్కయ్యలు. కుటుంబ పెద్దలంతా మగబిడ్డ ఉంటే బాగుండునురా అనటంతో ఫుల్‌స్టాప్ పెట్టలేదు నాన్న. ఎదుగుతున్న పిల్లలు, పెరిగే ఖర్చులు అమ్మ బెంగపడేదట. ఈసారి కాన్పులో మగబిడ్డనే ప్రసాదించమని ఎన్నో దేవుళ్లకి మొక్కుకొనేదట. అమ్మ మొక్కులు ఫలించి వరాల మూటను, బంగారు కొండ లాంటి పసివాడ్ని ఇచ్చేశారా దేవతలంతా. అమ్మ అలానే తనని ముద్దాడి మురిసిపోయేది వరాలమూట బంగారుకొండ అంటూ తనకి మీసాలు మొలుచుకొస్తున్నా అవే ముద్దులు.

''అందరి ముందూ ఏంటమ్మా నేనింకా చిన్నపిల్లాడ్నా'' బుంగమూతి పెట్టేవాడు.

ఇన్నేళ్ల తరువాత హృదయానికి మళ్లీ ఆ గిలిగింత.

''ఏరా..? నువ్ కొంపతీసి అమెరికాలో లేవు కదా!'' వీపుపై ఛళ్లున చరిచి బిగ్గరగా నవ్వాడు నాన్న.

''మళ్లీ ఆ మాట అనకండి నాన్న. ఇన్నేళ్లు మీ అందరికీ దూరంగా ఉండగలిగానంటేనే ఏదోలా ఉంది. ఈ ప్రేమా ఆత్మీయతలు ఏ డాలర్లతో కొనగలం. నేను మళ్లీ అమెరికా వెళ్లేది లేదు. ఆ నిర్ణయంతోనే ఉన్న ఊరే చిన్న స్వర్గం అనుకొని వచ్చేశాను'' నాన్న చేతిని కళ్లకద్దుకుంటూ అన్నాడు.

''చాల్లేరా నీ డంబాలు. మీ నాన్నని అమాయకుడ్ని చేసి బాగా కోతలు కోస్తున్నావ్. కాకపోతే వచ్చి రెండు నెలలు అయింది. ఆ స్నేహితుడు ఈ స్నేహితుడు అంటూ ఊళ్లంట తిరుగుతున్నావే తప్ప మీ అక్కయ్యలు గుర్తొచ్చార్రా నీకు'' ఇద్దరి పళ్లాల్లోనూ మరికాస్త టిఫిన్ వడ్డిస్తూ అంటున్న తల్లి ముఖంలోకి చిరాగ్గా చూశాడు ప్రసాదు.

''ఏనిటా మాటలు పార్వతి? వాడు ఏ పనిచేసినా వెనక ఏదో కారణం ఉంటుంది. అక్కయ్యలను ఏం ఆట పట్టించాలనుకుంటున్నాడో ఏమో. వాడు ఇండియా వచ్చినట్టు అమ్మాయిలకు తెలియనివ్వొద్దన్నాడు'' అన్నాడు శివరామయ్య.

''బాగా పోల్చేశారే నాన్న. ఓ వారం తిరిగేలోగానే అమ్మ సందేహాలన్నీ పటాపంచలైపోవు. అమ్మ సంగతి పక్కన పెట్టు. ఆ గమ్మత్తు ఏంటో మీక్కూడా చెప్పను నాన్నా. మీరు కూడా ఓపిక పట్టాలి మరి'' కాఫీ కప్పు టేబిల్‌పై పెట్టేసి దిగ్గున లేచాడు. ''మర్చేపోయాను నేనలా పోస్టాఫీసు దాకా వెళ్లొస్తాను'' అంటూ పరుగు లంకించుకున్న కొడుకుని చూసుకొని మురిసిపోయాడు శివరామయ్య. వీడి అల్లరంతా ఈ ఉత్తరాల్లోనే నడుస్తుందేమో గడుగ్గాయి అనుకున్నాడు.

వరప్రసాదు ఎదురుచూస్తోన్న మూడు లేఖలు పోస్ట్‌మాన్ దగ్గర నుంచి అందుకొని ''ఇంక నేను రానయ్యా. ఎప్పటిలా నీ పని నీదే'' అతనితో కరచాలనం చేస్తూ అన్నాడు.

''ఇంతకీ ఏవిటి బాబు ఈ ఉత్తరాల్లోని రహస్యం. ఎవర్రాశారేంటి? ప్రేమలేఖలేమో అనుకుందామంటే అమ్మానాన్నలు చూసిన అమ్మాయినే ఎగిరి గంతేసి మరీ చేసుకుంటున్నారు'' వాళ్ల ఇంటితో పోస్ట్‌మాన్ సూర్యానికున్న అనుబంధం ప్రసాదుతో ఇలా మాట్లాడే చనువు తెచ్చిపెట్టింది.

''నీ దగ్గర దాచేదేముంది సూర్యం. ఈ ఉత్తరాలు మా బావలే రాశారు. నిజం చెప్పు సూర్యం ఎంత పుణ్యం చేసుకుంటే వీళ్లంతా మా ఇంటి అల్లుళ్లు అయ్యారంటావ్. కనీసం పండగలకైనా ఇది నోరు తెరచి ఇది కావాలి అని అడిగారా మా బావలు. మాకు కలిగినంతలో ఏవో బట్టలు పెట్టినా అవి వాళ్ల హోదాకి ఏమాత్రం తగ్గవి కావు. అదృష్టం కలిసొచ్చి రెండు చేతులా సంపాదించాను. అందుకే మీమీ కోరికలు ఏమిటి? అంటూ అక్కలకి తెలియకుండా రాయమన్నాను. వాళ్ల భర్తలడిగిన కానుకలు నేనిస్తుంటే నా బంగారు అక్కయ్యల కళ్లల్లో మెరుపులు చూడాలి. ఇంతే నేను చేస్తున్న తమాషా'' ఇలా కాసేపు పోస్ట్‌మేన్ సూర్యంతో కబుర్లు చెప్పి ఉత్తరాలు చదువుకొనేందుకు లైబ్రరీకి నడిచాడు.

ఒక్కో ఉత్తరం చదువుతుంటే తలతిరిగిపోయిందతనికి. ఇప్పటివరకూ ఆదర్శపురుషులుగా, ఉన్నతమైన వ్యక్తిత్వం కలవాళ్లుగా, భార్యలను అపురూపంగా చూసుకుంటూ అత్తమామల నుంచి ఏమాత్రం ఆశించని ఆత్మాభిమానులుగా తన మనసులో సుస్థిర స్థానం సంపాదించిన ముగ్గురూ ఒక్కసారిగా వికటాట్టహాసం చేశారు. ఉత్తరాలు మూడింటిని చించి పడేస్తే సరి అనిపించింది ఓ క్షణం. తన పిచ్చి కాకపోతే అక్షరాలు రూపుమాసినా ఆలోచనలెక్కడకి పోతాయ్. తను గ్రీన్ సిగ్నల్ ఇచ్చేశాడుగా. వాళ్ల కోరికలు దురాశల వాహనాల మీద ఊరేగుతున్నాయ్. తను మాట జారాడు కనుక తన ఇన్నాళ్ల కష్టం హరించుకుపోయినా అక్కయ్యల కోసం వాళ్ల కోరికలు తీర్చి తీరాలి. తను మాటకు కట్టుబడి ఉండకపోతే అప్పటి నుంచి ముంచుకొస్తుంది తన ప్రాణానికి ప్రాణాలైన అక్కయ్యల బ్రతుకుల్లో పెనుతుఫాన్. ఒక్కో ఉత్తరాన్ని మళ్లీ మళ్లీ చదివాడు.

పెద్దబావ కోరిక పెనుభూతంగా భయపెట్టింది. అంత హోదా గల ఉద్యోగాన్ని వదిలి కన్సల్టింగ్ కంపెనీ పెడతాడట. ఆఫీసు పెట్టేందుకు బిల్డింగ్ నిమిత్తం ఓ పది లక్షలు ఇచ్చేయమంటున్నాడు. రెండవ బావ మెదడులో మాత్రం స్వార్థం అనే రాక్షసుడు మఠం వేసుకుని కూర్చోలేదూ. పిల్లలు ఎదుగుతున్నారట. సొంత ఇల్లు, ఓ కారు ఉంటేనే వాళ్లని సంతోషపెట్టగలరట. నాకంటూ కోరికలేమున్నాయ్. నువ్వేం చేసినా నీ అక్క పిల్ల

సత్యవాడ సోదరీమణులు

కోసమేగా. నువ్వు గనక ఓ పన్నెండు లక్షలు ఇచ్చావంటే పాతబడ్డ మా కొంప అమ్మేసి నీ పేరు చెప్పుకొని దర్జాగా బ్రతుకుతాం. ముత్యాల్లాంటి దస్తూరితో మూడో బావ ముద్దుముద్దుగా ఏం రాశాడు. చిన్నక్కని తెగ పొగుడుతూ అంత తెలివైన అమ్మాయితో ఒక స్కూలు గనక పెట్టించామంటే దేశమే బాగుపడిపోతుందట. పది లక్షలకి తక్కువ లేకుండా తనకి తోచినంత ఇవ్వాలట. కోరికల జాబితా ముప్పై లక్షలు దాటేసింది. తన ముచ్చటకీ వీళ్ల దురాలోచనలకీ పొంతన ఉందా! అవకాశం చేజిక్కితే ఎలాంటి వాళ్లు ఎలా అయినా మారిపోతారన్నమాట. వీళ్ల గొంతెమ్మ కోర్కెలే గనక తీర్చేస్తే తనకూ అమ్మానాన్నకు మిగిలేదేముంది. తనూ బావల అడుగుజాడల్లో నడవాలనే కదా కట్నం తీసుకోకుండా పేదింటి అమ్మాయిని చేసుకోడానికి సిద్ధపడ్డాడు. ఈ పరిస్థితుల్లో పెళ్లి చేసుకొని తనేం సుఖపడగలడు? భార్యనేం సుఖపెట్టగలడు. తన బావలు దశమగ్రహాలై కూర్చున్నారిప్పుడు.

తనెంత శ్రమపడి ఎందరి చేయూతతో అమెరికా వెళ్లాడు. హైస్కూల్ చదువులోనే తన టాలెంట్ గుర్తించి నరసింహం మాస్టారు ఎంత ప్రోత్సహించారు. తనకు సరైన కోచింగ్ ఇప్పించి ఫీజులు కూడా మాస్టారే కడుతూ ముందడుగు వేయించారు.

''మాకా పొలం పుట్రా ఉంది. వ్యవసాయానికి పనికొచ్చే చదువేదో చదివించేద్దాం మాస్టారు. ఏమీ చేతకానివాడ్ని. నన్నే భూదేవి ఇలా దయచూస్తోంది. చదువుసంధ్యలబ్బి, తెలివితేటలతో నా కొడుకు కనక పొలం పనులు చూసుకుంటే మా బతుకులు ఏ లోటూ లేకుండా వెళ్లిపోతాయ్.''


ఆ మోస్తరు భావాలు నాన్న వ్యక్తపరచినా మాస్టారు పట్టుదలతో మావయ్యలను కూడా తనవైపు తిప్పుకొని తనని ఇంజినీరుని చేశారు. అమ్మా నాన్నలతో సహా హైదరాబాద్‌లో కాపురం పెట్టేలోగానే తనకు అమెరికాలో కంపెనీ పని కల్పించారు. తను జాబు చేస్తున్న కంపెనీ ద్వారానే అవకాశం కలిసిరావడంతో ఆర్థికభారం నాన్నపై పడలేదు. కలిసొచ్చిన కాలంలా ఒక్కోటీ జరిగిపోతూంటే ఎంత ఆనందంగా ఉన్నా ఉన్న ఊరు, అయినవాళ్లు అంతా తన కళ్లలో మెదిలేవారు. తన వాళ్లతో కలిసి జీవించాలనే ఆకాంక్ష బలంగా ఉండేది. ఆ బలమైన కోరికే ఇప్పటి ఈ స్థితి. అమెరికాలో చేస్తున్న ఉద్యోగం వదిలేసి ఖరీదైన ఆ సుఖాలు కాలదన్నుకొని పుట్టిన గడ్డమీదే మనుగడ సాగించాలనుకొని తిరిగి ఇండియాకే వచ్చేశాడు.

తను తొలిసారిగా పనిచేసిన రాజ్యం కంప్యూటర్స్ మేనేజర్-

''బలే పనిచేసుకొచ్చావ్. అదృష్టం అందలం ఎక్కిస్తే బుద్ధి బురదలోకి లాగుతోందని ఊరికే అన్నారా! డాలర్ల నష్టాన్ని కాదనుకొని...ఛ..ఛ సుఖపడే యోగం లేదు నీకు. సరిసర్లే మన కంపెనీ నీ కుర్చీ నీకు రిజర్వ్ చేసే ఉంచింది.''

''థాంక్యూ సార్. కానీ మీ ఉపమానమే తప్పు సార్. మన దేశాన్ని బురదతో పోల్చి విదేశాలను అందలాలు అనటం అదీ అదృష్టంగా వక్కాణించటం అన్యాయం. బురదలోనే కదా సార్ మన ప్రాణాలను నిలిపే పంటలన్నీ పండేది'' నీళ్లు నిండిన కళ్లతో తనలా అనేసరికి అతగాడు పగలబడి నవ్వాడు.

''నీ ఆంతర్యాన్ని తెలుసుకోవాలని అన్నాను కానీ నువ్వేమిటో నాకు తెలియదటోయ్. అచ్చమైన స్వచ్ఛమైన రైతుబిడ్డడివి. నీకు దేశభక్తి, కుటుంబం పట్ల ప్రేమాభిమానాలు మిక్కుటంగా ఉన్నాయని నేనెప్పుడో పసికట్టాను. ఆల్ ది బెస్ట్. ఉద్యోగంలో చేరిపోయి తక్షణం గృహస్థుడివైపో'' భుజం తట్టాడు. తనకి గృహస్థాశ్రమం ఎక్కడా! సన్యాసాశ్రమమే.




''ఏరా... బావొస్తున్నాడంటే ఎగిరి గంతేస్తావనుకున్నాను. ముఖం ఇలా పెట్టావేంటి?'' నాన్న మాటకు బదులు లేదు. అమ్మ అందుకుంది.

''నే చెప్తూనే ఉన్నాకదండీ. వీడికి అక్కయ్యల మీద అభిమానం తరిగిపోయింది'' తింటున్న అన్నం అలానే వదిలేసి దిగ్గున లేచి చేయి కడుక్కున్నాడు.

''చూశారా ఉన్నమాట అన్నానని ఎంత

రోషమో. మరో దేశం వెళ్లాక అబ్బాయి మనవాడనే భ్రమలో పడకూడదు'' తల్లి ఇంకా ఏవేవో సణుగుతూనే ఉంది.

తన కొడుకు అలాంటివాడా? కాదు. తన బాబు మనసులోతులు తెలుసుకోవాలి. నిట్టూర్చాడు శివరామయ్య.

''నా అభిప్రాయం మార్చుకున్నాను నాన్నా. నేనిక్కడ ఉండలేను'' కొడుకే ముందుగా సంభాషణ ప్రారంభించడంతో విషయం కదిలించడం ఆ తండ్రికి తొందరగా సాధ్యపడింది. నెమ్మదిగా కొడుకు అంతర్యం అవగతం చేసుకున్నాడు. అల్లుళ్ల పైన అతనికున్న గౌరవం స్థానంలో ఏహ్యభావం చోటుచేసుకుంది.

''ఛ..ఛ ఇది ఏమంత విషయంరా. ఇన్నాళ్లూ కాచుకొని ఉన్నారు. జలగల్లా నిన్ను పీడించడానికి ఇప్పుడు సిద్ధపడ్డారు. వాళ్ల ధనదాహం తీర్చేద్దాం. కలిగున్నదే తిందాం. ఇంతమాత్రానికే తిరిగి అమెరికా వెళ్లిపోవాలా!''

''ఏమో నాన్నా నాకలానే అనిపిస్తుంది. ప్రేమానురాగాల కన్నా డబ్బుకే ప్రాధాన్యత ఇస్తున్న వీళ్లా మన చుట్టాలు? నా అంచనాలన్నీ తారుమారు చేశాక ఇక ఇక్కడెందుకుండాలి. మీరు సరే అంటే మిమ్మల్నీ నాతో తీసుకెళ్లిపోతాను.'' వాళ్లలా తర్జన భర్జనలు పడుతుండగానే పెద్దబావ ప్రత్యక్షమవ్వనే అయ్యాడు.

''ఏమయ్యా పెళ్లికొడకా. ఉన్నపాటున ఊడిపడ్డాననుకుంటున్నావా'' ప్రసాదు వీపుపై చరిచి నవ్వుతున్న చంద్రాన్ని చూస్తుంటే ఆ తండ్రి కొడుకులకే అరికాలు మంట నెత్తికెక్కింది.

''ఎలా అనుకుంటామల్లుడుగారు. తోకలేని పిట్టలతో పంపారుగా రాయబారాలు.''


''అవును బావగారు. మీరన్నట్టు మీ మీ పనులన్నీ చేసేద్దాం'' తండ్రి మాట పూర్తిచేశాడు.

''మీరెలా వెటకారించినా ఓ నిజం మీకు చెప్పాలి.''

''ఎందుకులే బావా? అవసరాలకే తప్పనిసరి పరిస్థితుల్లో అడిగాం అంటారు. నేను కాస్తో కూస్తో సంపాదించాను గనక మీరు నా దగ్గర నుండి ఆశించడం అల్లుళ్లుగా మీ హక్కు అంటారు. నేను కాదు, కూడదు అనేస్తే నన్ను బాధ్యత లేని బడుద్ధాయి అంటారు. అమాయకురాళ్లయిన మా అక్కల్ని వేధించడం మొదలుపెడతారు.''

''నీ మాటలు నీవేనా?, నేను చెప్పేది వినిపించుకోవా'' చంద్రం విషయం వివరించేసరికి ఆ ఇద్దరికీ పిచ్చిపట్టినట్టయింది.

''మీ అమ్మాయిలను కట్టుకునే వరకూ మేం ఎవరికి ఎవరమో. ఈ ఇంటి అల్లుళ్లమై అన్నదమ్ములమైపోయాం. మా భావాలొకటే. మా మనసులు చంచలమైనవి కావు. మీ అమ్మాయిలు ఏకమై ఆడిన నాటకానికి ఎలా తెరదించాలా అని తలలు పగలగొట్టుకోవలసి వచ్చింది. మా కంట పడకుండా నువ్వు రాసిన ఉత్తరాలు కాజేసి వాళ్ల పథకాల ప్రకారం జవాబులు టైపు చేయించి మీ ముందు మమ్మల్ని కుసంస్కారుల్ని చేశారు. నిజానికి ఈ ఇంటి ఆడపిల్లలు ఒకరిని మించి ఒకరు గడుసర్లు. వాళ్ల ఎత్తుగడలు బయటపెట్టి మీ ముందు వాళ్ల పరువుతీస్తే తేలికైపోతారట. అలానే బెదిరించారు. మా నోళ్లు మూయించడానికి మీ అక్కలు ఎంతలేసి ఘనకార్యాలు చేయడానికైనా సిద్ధం. పెద్దావిడ ప్రాణాలు తీసుకుంటుందట. చిట్టిమరదలు విడాకులిస్తుందట. ఈ రెంటిలో ఏదో మార్గాన రెండో ఆమె అఘోరిస్తుందట. ఏది ఎలా జరిగినా ఈ సంగతి వివరంగా మీకు తెలియటం ముఖ్యం అన్న నిర్ణయానికి ముగ్గురం వచ్చాం. తమ్ముళ్లిద్దరూ ఏమన్నారో తెలుసా...'నీకా ఇంటితో రెండు దశాబ్దాల అనుబంధం ఉంది. ప్రసాదు పసివాడుగానే నీ దగ్గర పెరిగాడు. నువ్వు నచ్చచెప్తేనే వాడర్థం చేసుకుంటాడు. మేం అతడి ముఖం చూడలేం. ఈ పేరాశలు మనవే అని, వాళ్ల అక్కయ్యలకి అంటగడుతున్నాం అని అపవాదు మనపైనే వేస్తాడేమో అన్న భయం' అంటూ నన్నే బయలుదేర దీశారు''



''ఎంత మాట బావా. ఈ ఇంటి మహారాణులు కుయుక్తులు అని తెలిశాక కూడా మిమ్మల్ని ఆడిపోసుకుంటామా. వాళ్లకి గుణపాఠం నేను చెప్తాను. మంచితనం మూర్తీభవించిన మిమ్మల్ని భర్తలుగా పొందటం వాళ్ల అదృష్టం అనాలి. నా బాధ ఒకటే బావా. పుట్టింటి మమకారం ఎక్కడికి పోయింది. వేలు చూపిస్తే మండ మింగినట్టు సరదాగా నేనేవో చిరుకానుకలు ఇవ్వాలనుకుంటే నా మీద ఇంత భారం మోపడానికి వాళ్ల మనసులెలా ఒప్పాయి.''

''డబ్బు మహిమరా. ఒక్కోసారి అదెంత పనైనా చేయిస్తుంది. అనవసరంగా మనం వీళ్లనపార్థం చేసుకోవలసి వచ్చింది. చిన్నవాడివైనా క్షమించు బాబు'' చంద్రం చేతులు పట్టుకొని అభ్యర్థిస్తున్నట్టుగా అన్నాడు శివరామయ్య.

## మిస్సమ్మ మరో మంచి సినిమా

**భూమిక తనకి ప్రత్యేకమైన ఇమేజ్‌ని తీసుకొచ్చే పాత్రల్ని ఎన్నుకుంటూ ముందుకెళ్తోందని ఆమె సినిమాలు చూసే వాళ్లకి అర్థమవుతుంది. ఇటీవలే 'మాయాబజార్'లో నటించిన భూమిక కొత్త సినిమా మొదలైంది. 'మిస్సమ్మ' లాంటి హిట్ చిత్రంలో జంటగా నటించిన శివాజీ-భూమిక రెండేళ్ల గ్యాప్ తర్వాత మళ్లీ ఇప్పుడు కలిసి ఈ సినిమాలో నటిస్తున్నారు. 'సత్యభామ' అనే పేరుతో, నిర్మాణం కానున్న ఈ సినిమా భూమికకు మిస్సమ్మ లాంటి మరో మంచి ఇమేజ్‌ని తీసుకొస్తుందని ఆమె భావిస్తోంది.**

''మన మధ్య క్షమార్పణలేంటి మావయ్యా. ఇక్కడితో ఈ విషయం వదిలేద్దాం. మీ అమ్మాయిలు ముగ్గుర్నీ ఎలా దారికి తెచ్చుకుంటారో అది మీ ఇష్టం. మేం కోరుకునేది మా ప్రసాదు పెళ్లికొడుకు కావటమే''

ప్రసాదు ముఖంలో పెళ్లి కళతో కూడిన చిరునవ్వు విరిసింది.

''అవునయ్యా బావమరిది. ఇంకా మా పప్పన్నం వాయిదా వేశావంటే మళ్లీ నీ వీపు బాజా మోతా మోగుతుంది'' ప్రసాదు కళ్లల్లోకి ఆనందంగా చూస్తూ అన్నాడు.★